సాక్షి విశాఖపట్నం

గురువారం । 24 । జూలై । 2025



ఏయూ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద విద్యార్థుల ఆందోళన



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఏయూ విద్యార్థుల ఆగ్రహ జ్వాల



ఏయూ ప్రవేశద్వారం వద్ద రాత్రి పడుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులు

- పురుగుల అన్నం పెట్టడంతో పెల్లుబికిన నిరసనలు
- అర్ధరాత్రి.. అర్ధాకలితో రోడ్డెక్కిన స్టూడెంట్స్
- నిరసనతో అట్టుడికిన ఆంధ్ర విశ్వవిద్యాలయం
- అధికారుల హామీతో ఆందోళన విరమణ



అన్నం, కూరలో పురుగులు

మద్దిలపాలెం: 'ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం..' అంటూ ఆంధ్రా యూనివర్సిటీ అధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా విద్యార్థులు అర్ధాకలితో రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. మంగళవారం రాత్రి సైన్స్ విద్యార్థుల హాస్టల్స్(ఎస్1, ఎస్2) మెస్‌లో వడ్డించిన అన్నం, కూరలో రోకలిబండ, పురుగులు కనిపించడంతో నిరసనకు దిగారు. మూడు రోజుల కిందట చికెన్‌లో కూడా పురుగులు వచ్చాయని వారు ఆరోపించారు. ఇంత అధ్వానంగా భోజనాలు పెట్టడమేమిటంటూ ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో ఏయూ ముఖ ద్వారం వద్ద బైఠాయించి ఆందోళన ప్రారంభించారు. అర్ధరాత్రి దాటినా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు.. రాత్రంతా అక్కడే జాగరణ చేసి నిరసన కొనసాగించారు. బుధవారం ఉదయం ఏయూలోని అన్ని వసతి గృహాలకు, తరగతి గదులకు ప్రదర్శనగా వెళ్లి తోటి విద్యార్థుల మద్దతు కూడగట్టుకున్నారు. అనంతరం రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు భారీ సంఖ్యలో చేరుకుని ఆందోళన కొనసాగించారు. 'ఏయూ అధికారుల నిరంకుశ వైఖరి నశించాలి', 'వీసీ డౌన్ డౌన్', 'పురుగుల అన్నం పెట్టినా పట్టించుకోని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.' అంటూ నినాదాలతో హోరెత్తించారు. వర్సిటీ సైన్స్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎన్.రాజు వారిని సముదాయించే ప్రయత్నం చేసినా విద్యార్థులు శాంతించలేదు. ఉపకులపతి వచ్చి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే తక్షణమే రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ విద్యార్థుల వద్దకు వచ్చారు. వారితో పాటు నేలపై కూర్చుని సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు.

సమస్యల ఏకరువు

ఐదు నెలల కిందట రోడ్డెక్కి సమస్యలు విన్నవించినా ఇంతవరకు పరిష్కరించలేదని ఏయూ ఎస్ఎఫ్ఐ నాయకుడు వెంకటరమణ వీసీకి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు.



సమస్యల పరిష్కారం కోసం ఏయూలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

- మెస్‌లో నాణ్యత లేని, పురుగులతో కూడిన భోజనం పెడుతున్నారు. ఇలా జరగడం ఇది రెండోసారి. మెస్‌లలో పరిశుభ్రత లేదు. నాసిరకం భోజనానికి భారీగా మెస్ బిల్లులు వసూలు చేస్తున్నారు.
- వసతిగృహాల కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలను, విద్యుత్ బిల్లులను మెస్ బిల్లుల్లో కలిపి విద్యార్థులపై మోపుతున్నారు. ఈ భారాన్ని యాజమాన్యమే భరించాలి.
- మహిళా వసతి గృహాల వద్ద రక్షణ లేదు. బయటి వ్యక్తులు ప్రాంగణంలోకి చొరబడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రక్షణ గోడలు నిర్మించి, సెక్యూరిటీని పెంచాలి.
- విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికీ తరగతులు ప్రారంభం కాలేదు. గెస్ట్ అధ్యాపకుల రెన్యువల్ ప్రక్రియలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నాం.
- ప్రతి వసతి గృహంలో రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి, పరిశుభ్రమైన తాగునీరు అందించాలి. కిచెన్, డైనింగ్ హాళ్లను ఆధునికీకరించి, కొత్త మంచాలు, కుర్చీలు సమకూర్చాలి.
- వర్సిటీ సెమినార్ హాళ్లను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి. డిస్పెన్సరీలో అన్ని మందులు ఉంచి, వైద్య సేవలు విస్తృతం చేయాలి. వెయిటింగ్ హాలు ఏర్పాటు చేయాలి. దూరవిద్యా కేంద్రాన్ని బలోపేతం చేయాలి. స్కాలర్‌షిప్‌లు సకాలంలో మంజూరు చేయాలి. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో గ్రంథాలయ సేవలు మెరుగుపరచాలి. హాస్టళ్లలో ఇంటర్నెట్ సదుపాయం, బోటనీ డిపార్ట్‌మెంట్ నుంచి బాలికల వసతిగృహం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. జేఆర్ఎఫ్, సీఎస్ఐఆర్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. సెంట్రల్ క్యాంటీన్ ప్రారంభించి, తక్కువ ధరకు ఆహారం అందించాలి. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి. విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

ఆచార్యుల తీరుపై ఆగ్రహం

వీసీ విద్యార్థులతో చర్చిస్తున్న సమయంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఎస్.రాజు, దూరవిద్యా కేంద్రం మాజీ డైరెక్టర్ ఆచార్య విజయమోహన్, మహిళా వసతిగృహం చీఫ్ వార్డెన్ ఆచార్య పల్లవిల తీరుపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ముగ్గురు ఆచార్యులు విద్యార్థులతో వాగ్వాదానికి దిగుతూ.. 'మీరిక్కడికి ఎందుకు వచ్చారు? మీదే గ్రూప్? మీ ఐడీ కార్డులు చూపించండి. వర్సిటీ విద్యార్థులు కాని వారిని అరెస్టు చేయండి.' అని అనడంతో విద్యార్థులు ఉవ్వెత్తున ఎగసిపడ్డారు. 'మీ సిబ్బంది ఐడీ కార్డులు ఎక్కడ? వర్సిటీలోకి వస్తున్న ఇతరుల ఐడీ కార్డులు ఎందుకు అడగడం లేదు?' అని విద్యార్థులు ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేయిస్తామని బెదిరిస్తారా? అంటూ ఆ ముగ్గురు ఆచార్యుల వైఖరిపై నిరసన గళం విప్పారు. ఏ ఒక్క విద్యార్థిపైనా కక్షపూరిత చర్యలు తీసుకున్నా మళ్లీ నిరసనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. దీంతో వీసీ కలుగజేసుకుని.. శాంతించాలని విద్యార్థులను కోరారు.



విద్యార్థులకు వార్నింగ్ ఇస్తున్న ప్రొఫెసర్

రెండు వారాల్లో పరిష్కారం.. వీసీ హామీ

విద్యార్థుల సమస్యలను విన్న వీసీ ఆచార్య రాజశేఖర్.. రెండు వారాల్లోగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. నాణ్యమైన ఆహారం అందించేందుకు 'ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేస్తామని, ఈ బృందం హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తుందని తెలిపారు. ప్రతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీలు నియమిస్తామని హామీ ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమస్యల పరిష్కారానికి వీసీ హామీ ఇచ్చినా విద్యార్థులు శాంతించలేదు. ఆందోళన కొనసాగించడంతో ఆచార్య ఎం.వి.ఆర్.రాజు విద్యార్థులతో మాట్లాడారు. 'ఆగస్టు 21లోగా మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం, నమ్మండి.' అని విద్యార్థులను శాంతింపజేశారు. దీంతో విద్యార్థులు తమ ఆందోళనను విరమించారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏయూ వీసీ రాజశేఖర్

న్యూస్‌రీల్

పోర్టులో ట్రైనీ ఐపీఎస్‌ల బృందం



పోర్టు అధికారులతో ట్రైనీ ఐపీఎస్‌ల బృందం

సాక్షి, విశాఖపట్నం : వివిధ రాష్ట్రాలకు చెందిన 28 మంది ట్రెయినీ ఐపీఎస్ అధికారుల బృందం విశాఖపట్నం పోర్ట్ అథారిటీ(వీపీఏ)ని బుధవారం సందర్శించారు. సముద్ర భద్రత, వాణిజ్య రంగంలో ఎదురయ్యే ఆధునిక సవాళ్ల గురించి అవగాహన ఏర్పరచుకునేందుకు ఈ సందర్శన సాగించారు. పోర్టు అధికారులు బృందానికి స్వాగతం పలికారు. పోర్టులో జరుగుతున్న వివిధ కార్యకలాపాలు, అభివృద్ధి పనుల గురించి పోర్టు అధికారులు వివరించారు. అనంతరం మౌలిక సదుపాయాలు, కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ, కవర్డ్ గోదాములు, సోలార్ పవర్ ఉత్పత్తి, పరిశ్రమల కోసం ఎస్‌టీపీ నీటి పునర్వినియోగం, పెట్టుబడుల అవకాశాలు ఎగుమతి దిగుమతులు మొదలైన విభాగాలను ట్రైనీ ఐపీఎస్ అధికారులు సందర్శించి.. సందేహాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బృందం మంగమారిపేట తీరంలో పర్యటించి మెరైన్ అడిషనల్ ఎస్పీ మధుసూదనరావు ఆధ్వర్యంలో మత్స్యకారులతో సమావేశమయ్యారు. మత్స్యకారుల జీవన విధి విధానాలు, తుఫాన్ సమయంలో వారు ఎదుర్కొనే సమస్యలపై అధ్యయనం చేశారు.

దక్షిణాదిలో ఉత్తమ సంస్థగా ప్రభుత్వ పాత ఐటీఐ



అవార్డు స్వీకరిస్తున్న ఉపాధి శాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్

కంచరపాలెం: కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల 'భారత్ స్కిల్ ఎన్ఎక్స్‌టీ–2025' అవార్డును అందుకుని, దక్షిణ భారతదేశంలోనే ఉత్తమ పారిశ్రామిక శిక్షణ సంస్థగా నిలిచిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర మంత్రులు జయంత్ చౌదరి, సుకాంత మజుందార్ చేతుల మీదుగా ఉపాధి, పారిశ్రామిక శిక్షణ శాఖ డైరెక్టర్ జి.గణేష్ కుమార్, అడిషనల్ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ విజయానికి కృషి చేసిన శాఖ ఉన్నతాధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే ఈక్యూ బెర్త్‌ల కేటాయింపు వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం: అత్యవసరంగా ప్రయాణించే ప్రత్యేక కోటా(ఈక్యూ) ప్రయాణికులకు మంజూరు చేసే బెర్త్‌లకు సంబంధించిన వేళలు మారాయి. ఇటీవల రిజర్వేషన్ చార్టింగ్ వేళల్లో మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో అత్యవసర కోటా వేళలను కూడా మార్పు చేస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అర్ధరాత్రి 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు ప్రయాణించే రైళ్లకు సంబంధించిన అత్యవసర కోటా బెర్త్‌ల అభ్యర్థనలను ముందురోజు మధ్యాహ్నం 12 గంటలకు కేటాయిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రయాణించే రైళ్లకు సంబంధించిన అత్యవసర కోటా బెర్త్‌ల అభ్యర్థనలను ముందురోజు సాయంత్రం 4 గంటల లోపు అందజేయాలి. ప్రయాణికులు ఈ కొత్త వేళలను గమనించి, తదనుగుణంగా తమ ఈక్యూ అభ్యర్థనలను సమర్పించాలని అధికారులు కోరారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తొలగింపు

విశాఖలీగల్ : మూడేళ్ల పదవీ కాలం పూర్తయిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తొలగిస్తూ రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి, మహిళా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్, కుటుంబ న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీలాపు శకుంతల పదవీ కాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో వారి పోస్టులను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీరి స్థానంలో త్వరలోనే కొత్తవారిని భర్తీ చేస్తామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఎయిర్‌పోర్టులో ఉచిత వైఫై

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో ఉచిత వైఫై సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎన్.పురుషోత్తం తెలిపారు. యాక్ట్ ఫైబర్ ద్వారా రూపొందించిన ఫ్రీ వైఫైని ప్రారంభించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాక్ట్ ఫైబర్ నెట్ ప్రెసిడెంట్ రోషన్ లాల్, సీనియర్ మేనేజర్ ప్రసాదరెడ్డి, ఎయిర్‌పోర్టు డీజీఎం ఆర్.భాస్కరరావు, ఐటీ విభాగం ఏఈ గణేశ్వరరావు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ప్రొఫెసర్ వేధింపులతో మనస్తాపం



చికిత్స పొందుతున్న అభిషేక్

డాబాగార్డెన్స్: పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లినందుకు ఓ ప్రొఫెసర్ కక్షగట్టి, తన విద్యా సంవత్సరాన్ని నష్టపరిచారని ఆరోపిస్తూ.. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన ఏయూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. బాధితుడి కథనం ప్రకారం.. ఏయూలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న అభిషేక్ (22).. ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాశాడు. అప్పటికే మ్యాథ్స్–2, డీఎల్‌డీ, డీఎస్‌సీ పరీక్షలను బాగా రాశానని విద్యార్థి తెలిపాడు. నాల్గోదైన ఫిజిక్స్ పరీక్ష రాస్తుండగా.. తన జేబులోని స్మార్ట్‌ఫోన్ కింద పడిపోయింది. అది గమనించిన ఇన్విజిలేటర్ ప్రొఫెసర్ పాల్.. తాను కాపీ కొడుతున్నానని భావించి, ఫోన్ లాక్కుని తనను బయటకు పంపించారని అభిషేక్ తెలిపాడు. 'తెలియక చేసిన తప్పు సార్, క్షమించండి.' అని ఎంత వేడుకున్నా ప్రొఫెసర్ కనికరించలేదన్నాడు. పరీక్ష అయిన తర్వాత సెల్‌ఫోన్ ఇచ్చేసి.. 'నేనేంటో నీకు చూపిస్తా' అంటూ బెదిరించారని వాపోయాడు. ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో అభిషేక్ రాసిన అన్ని సబ్జెక్టులలో ఫెయిల్ అయినట్లు చూపించారు. అంతేకాకుండా, 'ఈ ఏడాదికి నీకింతే.. వచ్చే ఏడాది పరీక్షలు రాసుకో' అంటూ ఇంటికి లేఖ పంపారని అభిషేక్ కన్నీటి పర్యంతమయ్యాడు. తాను బాగా రాసిన మూడు పరీక్షలను కూడా ఉద్దేశపూర్వకంగా రద్దు చేసి ఫెయిల్ చేయించారని, ప్రొఫెసర్ వేధింపుల వల్లే తాను విద్యా సంవత్సరం నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించినట్లు అభిషేక్ తెలిపాడు. తనకు న్యాయం చేసి, విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని వర్సిటీ అధికారులను వేడుకుంటున్నాడు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికపై వైఎస్సార్ సీపీ సమీక్ష





సమావేశంలో పాల్గొన్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, పార్టీ కార్పొరేటర్లు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అధ్యక్షతన కార్పొరేటర్లతో సమావేశం
- పాల్గొన్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం జరిగింది. బుధవారం మద్దిలపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్పొరేటర్ల సమావేశానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు హాజరయ్యారు. ఇటీవల జీవీఎంసీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్ సీపీ విధించిన విప్‌ను ధిక్కరించిన 27 మంది కార్పొరేటర్లకు హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పోటీ చేసే అంశంపై ఆ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులతో ఈ సమావేశంలో చర్చించారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్యనాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ కటమూరి సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్‌రావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్లు అక్కరమాని పద్మ, దొలపల్లి ఏడుకొండలరావు, కోరుకొండ వెంకట రత్న స్వాతి దాస్, కటారి అనిల్ కుమార్, నక్కిల లక్ష్మి, సాడి పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, తోట పద్మావతి, చెన్న జానకిరామ్, గుండాపు నాగేశ్వరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, వావిలపల్లి ప్రసాద్, భర్కత్ అలీ, కె.వి.శశికళ, జి.లావణ్య, పి.వి.సురేష్, బల్లా లక్ష్మణ్, మహమ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనూష, ఉరుకూటి రామచంద్రరావు, భూపతి రాజు సుజాత, కో ఆప్షన్ సభ్యులు ఎండీ షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ , జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అంతా యాపారమే..



అయోధ్య మందిరం సెట్

ఆధ్యాత్మికత ముసుగులో వసూళ్లు

- ప్రవేశాల నుంచి చెప్పులు స్టాండ్ వరకు రుసుములే..
- దుకాణాల అద్దెలతో వ్యాపారం
- హోర్డింగ్ కోసం రూ.లక్షల చెల్లించాల్సిందే..
- బీచ్ రోడ్‌లోని రామాలయం సెట్‌పై విమర్శలు వెల్లువ
- తాజాగా కల్యాణం పేరుతో రూ.2,999 వసూలు

ఏయూక్యాంపస్ : దేవుడిని దర్శించుకోవాలంటే టికెట్ కొనాలి. చెప్పులు పెట్టడానికి టికెట్ కొనాలి. దాహం వేసి మంచినీళ్ల కావాలంటే అక్కడే పెట్టిన దుకాణాలలో కొనుగోలు చేయాలి. ఇలా అడుగడుగునా ఆధ్యాత్మికత పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు. బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గరుడ అయోధ్య రామ మందిరం నమూన చుట్టూ ఆర్థిక లావాదేవీలే కనిపిస్తున్నాయి. గత రెండు నెలలుగా బీచ్‌రోడ్డులో నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక వ్యాపారం వెనుక ఉన్న అనేక అంశాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి.

దేవుడి పేరుతో దండుకొంటున్నారు

దేవుడి పేరు చెప్పి గత రెండు నెలలుగా కోట్లాది రూపాయలు దండుకున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక్కడి పరిస్థితులు సైతం దీనికి అద్దం పడుతున్నాయి. అయోధ్య రామ మందిరం నమూనాను రెండు నెలల క్రితం బీచ్‌రోడ్డులోని ఒక ప్రైవేటు విల్లాకు సంబంధించిన స్థలంలో నిర్మించారు. ప్రవేశ రుసుముగా రూ.50, చెప్పులు భద్రపరచడానికి రూ.5 చొప్పున వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో వెయ్యి నుంచి నాలుగు వేల మంది, శని, ఆది వారాలలో 5 నుంచి 10 వేల మంది దీనిని దర్శించుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో గత రెండు నెలల కాలంలో నిర్వాహకులు భారీగానే సంపాదించారని స్థానికులు చెబుతున్నారు. వీరు పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభాలను పొందారనే విషయం స్పష్టం అవుతోంది. అదే విధంగా ఇక్కడ సందర్శకులకు కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వడం లేదు. అక్కడే ఏర్పాటు చేసిన దుకాణాల్లో కొనుక్కోవాల్సిందే.

రాముని కల్యాణంతో బయటకు పొక్కింది

అయోధ్య రాముని కల్యాణోత్సవాలు పేరుతో గత కొన్ని రోజులుగా నగరంలో పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. ఈ నెల 29న నిర్వహించే కల్యాణంలో భద్రాచలం ఆస్థాన పండితులు పాల్గొంటారని పేర్కొన్నారు. రూ.2,999 ధర గల కల్యాణం టికెట్ల కోసం తమను సంప్రదించాలని కోరుతూ ఫోన్ నంబర్లను సైతం ప్రకటించారు. రాముని కల్యాణాన్ని సైతం ఒక వ్యాపార కార్యక్రమంగా మార్చేశారు. దీనిపై భద్రాచలం ఆలయ అధికారులు విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇక్కడ అనధికారికంగా జరుగుతున్న తంతు బయటకు వచ్చింది. నిర్వాహకులు మాత్రం తాము భద్రాచలం ఆస్థాన పండితులు వస్తారని చెప్పలేదని, భద్రాచలం నుంచి పండితులు వస్తారని మాత్రమే చెప్పామని వివరణ ఇచ్చేసి చేతులు దులిపేసుకున్నారు.

బాధితులు బయటకు వస్తున్నారు

అయోధ్య రామ మందిరం సెట్ వేసిన నిర్వాహకుడు దుర్గాప్రసాద్ చేతిలో నష్టపోయిన కాకినాడకు చెందిన దుర్గ గణేష్ తాజాగా ఒక వీడియో విడుదల చేశాడు. అయోధ్య రామ మందిరం సెట్ పేరుతో రూ.32 లక్షలు ఖర్చుచేయించి, డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఆరోపించారు. కూరగాయల వ్యాపారం చేసే తనను నమ్మించి కుంభమేళాలో రామ మందిరం సెట్ వేస్తున్నానని, దానిలో పెట్టుబడిగా రూ.30 లక్షలు ఇస్తే రూ.50 లక్షలు ఇస్తానని నమ్మించి మోసం చేశాడని వీడియోలో ఆరోపించాడు. ఇప్పటికే తాను కాకినాడ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపాడు.



గణేష్

దుకాణాల నుంచి ఫ్లెక్సీల వరకు..



ప్రాంగణంలో ఏర్పాటుచేసిన దుకాణాలు



దుకాణాల కోసం సంప్రదించాలని ఏర్పాటు చేసిన బోర్డు

ప్రవేశం నుంచి ఆలయం నమూనా వరకు మధ్యలో ఉన్న ప్రదేశంలో పదుల సంఖ్యలో దుకాణాలు నిర్మించేశారు. వీటిని లక్షలాది రూపాయలకు అద్దెలకు ఇచ్చారు. ప్రారంభంలో ఒక్కో దుకాణానికి రూ.2.5 లక్షలు అద్దె చెల్లించాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఆశించిన స్థాయిలో వ్యాపారులు ముందుకు రాకపోవడంతో కొంత తగ్గించి ఇచ్చినట్లు సమాచారం. అదే విధంగా ప్రత్యేకంగా చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేసి ఒక్కో జతకు రూ.5 చొప్పున వసూలు చేశారు. ప్రవేశ రుసుం, చెప్పుల స్టాండ్‌లు వంటివి ఏర్పాటు చేసే సమయంలో సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి. దుకాణాలతో పాటు దారి పొడవుడా వివిధ వ్యాపార సంస్థలకు సంబంధించిన ఫ్లెక్సీలను ప్రచారం కోసం ఏర్పాటు చేసుకున్నారు. దీనికోసం సదరు సంస్థల నుంచి లక్షలాది రూపాయలు అద్దె రూపంలో వసూలు చేశారని తెలిసింది. టికెట్ కౌంటర్ కలెక్షన్లు రోజుకి రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు జరిగేవని తెలిసింది. వీటికి తగిన పన్నులు చెల్లిస్తున్నారా అనే విషయం ఎక్కడా బయటకు రావడం లేదు. చివరకు ప్రసాదం కూడా విక్రయాలు జరిపారని తెలిసింది. ఇక్కడ ఏర్పాటు చేసిన దుకాణాల్లో ఎటువంటి భద్రతా ఏర్పాట్లు చేయలేదు.

సరైన పార్కింగ్ లేదు

ఇంతటి భారీ సెట్ వేసిన నిర్వాహకులు సందర్శకులకు పార్కింగ్ సదుపాయం కూడా కల్పించలేదు. పార్కింగ్ స్థలాన్ని సైతం వ్యాపార అవసరాలకు వినియోగిస్తూ దుకాణాలుగా మార్చేశారు. దీంతో నిత్యం వచ్చే వేలాది మంది సందర్శకులు తమ వాహనాలు బయటరోడ్డుపైన, ఫుట్‌పాత్‌లపైన నిలిపివేస్తున్నారు. రద్దీగా ఉండే బీచ్‌రోడ్డు దీంతో మరింత రద్దీగా ఇబ్బందికరంగా మారింది. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం నిర్వాహకులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోడం అనుమానాలకు తావిస్తోంది.

15 ఏళ్లుగా మృత్యువుతో పోరాడుతున్నాడు కృష్ణ. అతనికి కాళ్లు విరిగినప్పుడు కాదు.. కిడ్నీలు పాడయ్యాయని తెలిసినప్పుడు జీవితం అగమ్యగోచరంలా మారింది. కేవలం కృష్ణ ఒక్కడే కాదు, అతని తల్లి, తమ్ముడు, భార్య.. ఇలా అతని కుటుంబంలో నలుగురు ఇదే మహమ్మారితో యుద్ధం చేస్తున్నారు. ఇది కేవలం కృష్ణ కుటుంబ కథ కాదు. పద్మనాభం మండలం భద్రయ్యపేట అనే చిన్న గ్రామంలోని బాధితుల వ్యథ. ఏడేళ్లలో 20 మందిని బలిగొని, మరో 50 మందిని మంచాన పడేసిన ఈ కిడ్నీ వ్యాధి ఇప్పుడు ఆ ఊరిని నిశ్శబ్దంగా మింగేస్తోంది.

కబళిస్తున్న కిడ్నీ మహమ్మారి


భద్రయ్యపేట గ్రామం

- భద్రయ్యపేటలో ఏడేళ్లలో 20 మంది మృతి
- 138 మందికి పరీక్షలు చేస్తే 50 మందికి వ్యాధి నిర్ధారణ
- ఇందుకు కారణం క్వారీలా? కలుషిత నీరా?

పద్మనాభం: మండలం రెడ్డిపల్లి పంచాయతీలోని భద్రయ్యపేట గ్రామస్తులను కిడ్నీ వ్యాధి తీవ్రంగా పట్టిపీడిస్తోంది. గ్రామంలోని మూడు వందల జనాభాలో ఇప్పటికే 50 మంది ఈ వ్యాధి బారిన పడ్డారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గడిచిన ఏడేళ్లలో సుమారు 20 మంది కిడ్నీ వ్యాధితోనే మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ క్రమంలో తమకు రక్తపరీక్షలు నిర్వహించాలని గ్రామస్తులు రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులకు వినతిపత్రం అందించారు. వారి అభ్యర్థన మేరకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మేలో 138 మంది నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 50 మంది రక్తంలో క్రియేటినిన్ స్థాయిలు ఉండాల్సిన దాని కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వారికి కిడ్నీ వ్యాధి సోకినట్లు మూడు రోజుల కిందట పీహెచ్‌సీ సిబ్బంది నిర్ధారించడంతో గ్రామస్తుల్లో ఆందోళన మరింత పెరిగింది. వీరికి మళ్లీ పరీక్షలు జరిపేందుకు మంగళవారం కొంతమందిని, బుధవారం మరికొంతమందిని కేజీహెచ్‌కు తరలించారు.


కిడ్నీ వ్యాధి బారిన పడిన వారి వివరాలు సేకరిస్తున్న రేవిడి పీహెచ్‌సీ సిబ్బంది

ఒకే కుటుంబంపై తీవ్ర ప్రభావం

ఈ వ్యాధి ఆల్తి గోపాల్ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. ఇప్పటికే ఆయన ఇంట్లో బుచ్చిబాబు, సన్యాసమ్మ, అప్పలనరసమ్మ కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. ఆయనతో కలిపి ఆ ఇంట్లో మొత్తం నలుగురు మరణించారు. జూన్‌లోనే అప్పలనరసమ్మ కన్నుమూశారు. మరోవైపు వృద్ధురాలు కొరాడ రాములమ్మతో పాటు ఆమె కుమారులు కృష్ణ (54), శ్రీను (30), కోడలు చినతల్లి (49) కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు.


కిడ్నీ వ్యాధితో మంచాన పడిన తల్లి రాములమ్మ, కొడుకు కృష్ణ

కారణాలపై అనుమానాలు

గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా శుద్ధి చేసిన నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ఆ నీటిని రాత్రిపూట పట్టి ఉంచితే తెల్లవారేసరికి సున్నం రంగులోకి మారిపోతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి సమీపంలో మూడు క్వారీలు ఉన్నాయి. క్వారీల్లో రాయిని పగలగొట్టడానికి ఉపయోగించే పేలుడు పదార్థాల రసాయనాలు విషతుల్యమై, భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

డీఎంహెచ్‌వో పర్యటన


భద్రయ్యపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

డీఎంహెచ్‌వో పి. జగదీశ్వరరావు తన బృందంతో కలిసి బుధవారం భద్రయ్యపేటను సందర్శించారు. బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది భద్రయ్యపేటలోనే అందుబాటులో ఉండి వైద్యం అందించాలని ఆదేశించారు. నడుము నొప్పి, నీరసం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏఎంసీ వైద్య బృందాన్ని గ్రామానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. అయితే గ్రామంలో నీరు కలుషితం కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఎంపీడీవో ఎం. విజయ్‌కుమార్, కార్యదర్శి నూర్జహాన్, డాక్టర్ బి. ఉమావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో నలుగురికీ కిడ్నీ వ్యాధి



మా ఇంట్లో నలుగురం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాం. మా అమ్మ రాములమ్మ, నేను ఈ వ్యాధి కారణంగా మంచానపడ్డాం. నా తమ్ముడు శ్రీను, నా భార్య చినతల్లి కూడా ఇదే వ్యాధితో బాధపడుతున్నారు. 15 ఏళ్ల కిందట నాకు కాళ్లు విరగడంతో ఆపరేషన్ కోసం కేజీహెచ్‌కు వెళ్లాను. అక్కడ చేసిన పరీక్షల్లో నా రెండు కిడ్నీలు పాడయ్యాయని వైద్యులు చెప్పారు. ఆపరేషన్ చేస్తే ప్రాణహాని ఉంటుందన్నారు. అయినా నా బలవంతం మీద ఆపరేషన్ చేశారు. 15 ఏళ్ల నుంచి కిడ్నీ వ్యాధికి మందులు వాడుతున్నాను. ఇంటి నుంచి బయటకు నడిచి వెళ్లలేని స్థితిలో ఉన్నాను. ఏ పనీ చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాను.

– కె. కృష్ణ, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు

నడవడానికి ఇబ్బందిగా ఉంది



నేను కిడ్నీ వ్యాధి బారిన పడటంతో ఏ పనికీ వెళ్లలేకపోతున్నాను. ఇంట్లోనే ఉంటున్నాను. కాసేపు నడిచినా నడుము, ఒళ్లు నొప్పులు, ఆయాసం వస్తున్నాయి. కంటి ఆపరేషన్ చేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్తే, కిడ్నీలు బాగాలేవని ఆపరేషన్ చేయకుండానే వెనక్కి పంపించారు. కేజీహెచ్‌కు వెళ్లి కిడ్నీ వ్యాధికి మందులు వాడుకోవాలని సూచించారు. రెండేళ్లగా మందులు వాడుతున్నాను.

– కె. నరసింహం, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు

గ్రామంలో పరీక్షతోనే తెలిసింది



రేవిడి పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో కొందరి నుంచి రక్త నమూనాలు సేకరించారు. నా నుంచి కూడా తీసుకున్నారు. పరీక్షల తర్వాత నాకు కిడ్నీ వ్యాధి ఉన్నట్టు చెప్పారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు వస్తుంది. కానీ రాత్రి పట్టిన నీరు తెల్లారేసరికి సున్నం రంగులోకి మారిపోతోంది. అధికారులు మా తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– కె.బంగారు తల్లి, కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు

కోహినూర్ వజ్రం కథతో 'వీరమల్లు'


ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మద్దిలపాలెం: 'హరి హర వీరమల్లు' చిత్రం ఆలస్యంగా వచ్చినా ఒక అద్భుతం సృష్టిస్తుందని, ప్రేక్షకుల అంచనాలకు మించి విజయం సాధిస్తుందని ఉప ముఖ్యమంత్రి, చిత్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం జరిగిన చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన నటన గురువు సత్యానంద్‌ను, సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణిని శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన పేరే పవన్ అని.. తాను అంతా ఉంటానని అన్నారు. విశాఖతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, తన నటనకు పునాది పడింది ఉత్తరాంధ్రలోనే అని పవన్ అన్నారు. తనకు ఉత్తరాంధ్ర, ఇక్కడి ఆటాపాట చాలా ఇష్టమన్నారు. తనకు నటన నేర్పిన ప్రదేశం విశాఖ అని, అందుకే ఈ నగరంలో ప్రచార కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. 'నా సినిమా చూడండి అని అడగడం నాకు మోహమాటం. నాకు ఇవ్వడమే తెలుసు.. తీసుకోవడం రాదు' అని అన్నారు. తన మొదటి చిత్రం అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్ర షూటింగ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిందని గుర్తు చేసుకున్నారు. ప్రజా కంటకుడైన ఔరంగజేబు తీసుకెళ్లిపోయిన కోహినూర్ వజ్రాన్ని తీసుకురావడం అనే కథాంశంతో, ఈ చిత్రం ఒక అద్భుతమైన హిస్టారికల్ సోషియో ఫాంటసీగా అలరిస్తుందన్నారు. దర్శకులు క్రిష్, జ్యోతి కృష్ణ, హీరోయిన్ నిధి అగర్వాల్, నిర్మాత ఎ.ఎం రత్నంల కృషిని అభినందించారు. కీరవాణి సంగీతం, ముఖ్యంగా క్లైమాక్స్ సన్నివేశాలకు అందించిన నేపథ్య సంగీతం రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తుందని కొనియాడారు. సినిమా ఎంటర్‌టైన్ చేస్తే చాలని చాలా మంది అనుకుంటారని.. నా సినిమాలు ఎంటర్‌టైన్‌తో పాటు ఎడ్యుకేట్ చేయాలని కోరుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ బైబైయ్యే బంగారు రమణమ్మా.. లబో లబో లబరి గాజులు పాటలు పాడి అలరించారు. హీరోయిన్ నిధి అగర్వాల్, సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి, నటులు రఘుబాబు, డ్యానియల్ తదితరులు చిత్ర అనుభవాలను పంచుకున్నారు. గాయనీగాయకులు చిత్రంలోని పాటలు ఆలపించారు. సన్నీ బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జనసేన ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై దృష్టిసారించండి

ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 2026 మార్చి నాటికి అన్ని ఇళ్లు పూర్తి కావాలని నిర్దేశించారు. రోజువారీ లక్ష్యాలు పెట్టుకొని పనిచేయాలని సూచించారు. బుధవారం హౌసింగ్, స్పెషల్ ఆఫీసర్లు, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై లేఅవుట్ వారీగా సమీక్షించారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా ఇళ్ల నిర్మాణాల పనులు చేయించాలని పేర్కొన్నారు. లక్ష్య సాధనలో విఫలమైన అధికారులు, సిబ్బందికీ మూడు దఫాలు మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, అప్పటికీ పురోగతి లేకపోతే సస్పెండ్‌కు రిఫర్ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. మంజూరైన ప్రతి ఒక్కరితో ఇల్లు కట్టించి తీరాల్సిందేనని.. అప్పటికీ ఇల్లు నిర్మాణానికి ఆసక్తి చూపకపోతే సంబంధిత లబ్ధిదారుల పట్టాను, ఇల్లును రద్దు చేస్తామని చెప్పాలని అధికారులకు సూచించారు. అలాగే విద్యుత్, తాగునీరు, డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని వివిధ విభాగాల అధికారులను ఆదేశించారు. పాపాయి సంతపాలెం, విజయపాలెం లేఅవుట్లలో అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల వివరాలను తెలుపుతూ నివేదిక పంపించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, ఈఈ శ్రీనివాసరావు, డీఈలు, ఏఈలు, లేఅవుట్ ఇన్‌చార్జి అధికారులు, ప్రత్యేక అధికారులు, వర్చ్యువల్‌గా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమెనిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఉద్యోగి ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌లో విశాఖ ఉక్కు ఉద్యోగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కోక్ ఓవెన్ విభాగంలో పనిచేస్తున్న బొడ్డ శ్రీనివాస్ (32) తన ఇంట్లోని గదిలో సీలింగ్‌కు ఉరివేసుకొని మృతి చెందాడు. శ్రీనివాస్ విధులకు సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో ఉక్కు యాజమాన్యం అతన్ని సస్పెండ్ చేసింది. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. దువ్వాడ పోలీసులు అందించిన వివరాలివి.. శ్రీనివాస్ కొంతకాలంగా మౌనంగా ఉంటూ ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం గదిలోకి వెళ్లి సీలింగ్‌కు తాడు కట్టి ఉరి వేసుకున్నాడు. కొంతసేపటి తరువాత అతని తండ్రి అప్పలరాజు గది తలుపులు కొట్టగా.. ఎటువంటి స్పందన రాలేదు. స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టి చూశారు. అప్పటికే శ్రీనివాస్ మరణించినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అక్కడికి చేరుకుని శ్రీనివాస్ మృతిపై వివరాలు సేకరించారు. కాగా.. శ్రీనివాస్‌కు 2016లో ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం వచ్చింది. కొన్నేళ్ల కిందట తల్లి మంగమ్మ మరణించింది. అతనికి సోదరుడు ఉన్నాడు. ఈ ఘటనపై సీఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

బాంబు పేలుళ్లు.. గన్ ఫైరింగ్‌లు

- పారిశ్రామిక నగరంలో యుద్ధ వాతావరణం
- పోర్టు, ఐఎస్‌పీఆర్‌ఎల్, బీడీఎల్‌లో మాక్‌డ్రిల్


నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీతో సమావేశమైన ఎన్‌ఎస్‌జీ, ఇతర శాఖల అధికారులు


కౌంటర్ టెర్రరిస్ట్ మాక్ డ్రిల్ చేస్తున్న ఎన్‌ఎస్‌జీ కమాండోలు

విశాఖ సిటీ : ఒక్కసారిగా ధామ్‌మని బాంబు పేలింది. ఆ శబ్దం ఎక్కడి నుంచి వచ్చిందోనని తేరుకునేలోగా గన్‌ఫైరింగ్ వినిపించింది.. బాంబుల పొగల నుంచి అధునాతన రైఫిల్స్ పట్టుకుని బ్లాక్ కమాండోలు దూకారు. ఒక్కసారిగా ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. అక్కడున్న ప్రజలు, అటువైపుగా వెళుతున్న వాహనదారుల్లో ఏం జరుగుతోందోన్న ఆందోళన మొదలైంది. చివరకు అది కౌంటర్ టెర్రరిస్ట్ విన్యాసాలని తెలుసుకుని అంతా ఊపిరిపీల్చుకున్నారు. నగరంలో పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ నెల 21వ తేదీ నుంచి కౌంటర్ టెర్రరిస్ట్ వ్యాయామాన్ని నిర్వహిస్తున్నారు. గత మూడు రోజులుగా విశాఖ పోర్టు, ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి కీలకమైన ప్రాంతాల్లో టెర్రరిస్ట్‌ల దాడులను తిప్పికొట్టేలా మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ నెల 25వ తేదీ వరకు ఈ డ్రిల్ జరగనుంది. రాష్ట్ర పోలీసులు, ఆక్టోపస్, అగ్నిమాపక, ఇతర సంబంధిత శాఖల అధికారులు, కేంద్ర బలగాలైన ఎన్‌ఎస్‌జీ బృందం సమన్వయంతో ఉగ్రవాద కార్యకలాపాలను చిత్తు చేసే వ్యూహాలను పదును పెట్టేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఒకవైపు టెర్రరిస్టులపై విరుచుకుపడుతూనే.. మరోవైపు గాయపడిన తోటి సైనికులకు వైద్య సహకారం అందించేందుకు ఏ విధమైన కార్యచరణ సంసిద్ధం చేయాలన్న దానిపైనా ప్రదర్శన చేశారు. అలాగే ఇందులో ఉగ్రవాగుల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టడంతో పాటు బందీలను రక్షించడం, ఐఈడీ ఆపరేషన్స్ విన్యాసాలు చేశారు.

ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం


సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి అన్ని విభాగాల ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను మూడు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గత 30 రోజులుగా వార్డు సచివాలయాల వారీగా అడ్మిన్ కార్యదర్శుల లాగిన్‌లలో ఉన్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఏ విభాగానికి సంబంధించిన ఫిర్యాదునైనా ఆ విభాగాధిపతులు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజనీరు పల్లంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, యూసీడీ పీడీ సత్యవేణి, డీసీఆర్ శ్రీనివాసరావులను ఆదేశించారు. సచివాలయాల్లో అడ్మిన్ కార్యదర్శులు, ఇతర కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదని.. సచివాలయాల్లో కూడా ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినప్పుడు మూమ్‌మెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేసి వెళ్లాలని సూచించారు. వార్డు కార్యదర్శులందరూ సచివాలయాల్లో తప్పనిసరిగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో నిమగ్నమై.. ప్రజలకు సేవలు అందించాలని కమిషనర్ ఆదేశించారు. అడ్మిన్ కార్యదర్శులు అనుమతి/సెలవుపై వెళ్లాల్సి వస్తే జోనల్ కమిషనర్‌కు తెలియజేయాలన్నారు. సచివాలయాల వారీగా రోజుకు ఒకటి లేదా రెండు ప్రజా వినతులు మాత్రమే వస్తాయని, కార్యదర్శులు క్రమశిక్షణతో పనిచేస్తే అసలు వినతులే పెండింగ్‌లో ఉండవని ఆయన స్పష్టం చేశారు. చాలా మంది ప్లానింగ్ కార్యదర్శులు తమ సంబంధిత విధులను నిర్వహించకుండా ఇతర చోట్ల పని చేస్తున్నారని, అందువల్ల ప్లానింగ్ సమస్యల పరిష్కారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని జోనల్ కమిషనర్లు తెలపగా.. అటువంటి వారి జాబితాను అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. పురమిత్ర యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. ఈ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు.

మాక్ డ్రిల్‌లో నిర్లక్ష్యం

బాలికకు తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

కూర్మన్నపాలెం: స్థానిక యాదవ జగ్గరాజుపేటకు సమీపంలోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తుండగా అపశ్రుతి చోటుచేసుకొంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమాదంలో ఒక బాలిక తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీడీఎల్ సంస్థలో మంగళవారం రాత్రి అక్కడ సెక్యూరిటీ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ముందున్న రహదారిపై వాహనాలను నిలిపివేశారు. అప్పటికే సంస్థలో పెద్ద శబ్దాలు వెలువడుతున్నాయి. అదే సమయంలో ఎస్‌టీబీఎల్‌లో నివాసముంటున్న బొమ్మిడి సురేంద్రవర్మ తన కుమార్తె మనశ్రీ(8)ని తీసుకొని వెళ్తూ వాహనాలు నిలిపివేయడంతో అక్కడ ఆగిపోయాడు. ఇంతలో పెద్ద శబ్దం రావడం వెంటనే బాంబులోని ఒక రవ్వ లాంటిది మనశ్రీ ముఖంపై పడడంతో తీవ్ర గాయమైంది. తక్షణమే ఆ బాలికను కూర్మన్నపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అటు పోలీసులు గాని ఇటు సంస్థ యాజమాన్యం గాని పట్టించుకోకపోవడంపై బాలిక కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎమ్మెల్యే గణబాబు బుధవారం ఆసుపత్రికి వెళ్లి ఆ బాలికను పరామర్శించారు.

గడువు దాటిన ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ

పట్టించుకోని జీవీఎంసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు


వుడా కాలనీలో పంపిణీ చేస్తున్న ఎనర్జీ డ్రింక్స్

మధురవాడ: గడువు దాటిన తర్వాత ఏ వస్తువునైనా వాడితే అది విషతుల్యంగా మారుతుందన్నది జగమెరిగిన సత్యం. అయినప్పటికీ మధురవాడ, మిథిలాపురి, వుడా కాలనీల పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా పేదలు అధికంగా నివసించే చోట ప్రముఖ సంస్థకు చెందిన ఎనర్జీ డ్రింక్స్‌ను ఆటోల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ డ్రింక్స్‌కు గడువు తేదీ ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటం, కొన్ని గడువు దాటిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ డ్రింక్స్ విషపూరితమని తెలియని పేద ప్రజలు, చిన్నా పెద్దా తేడా లేకుండా, ఎగబడి వీటిని తీసుకుని ఇళ్లల్లో నిల్వ చేసుకుంటున్నారు. కొందరు వాటిని వెంటనే తాగుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ గడువు దాటిన తర్వాత ఈ డ్రింక్స్‌ను వాడితే ఆరోగ్యానికి ప్రమాదమని హెచ్చరించారు. అంతేకాకుండా వీటిలో కెఫీన్ ఉండటం వల్ల గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ముఖ్యంగా పిల్లలకు ఇది మరింత హానికరమన్నారు. ఇటువంటి సంఘటనలు నిత్యం అనేక ప్రాంతాల్లో జరుగుతున్నప్పటికీ.. వీటిని నియంత్రించాల్సిన జీవీఎంసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై మధురవాడ జోన్ ఫుడ్ సేఫ్టీ అధికారి ఆనందరావును వివరణ కోరగా.. ఇలాంటి డ్రింక్స్‌ను పంచుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆటో, పంపిణీ చేస్తున్న వ్యక్తుల వివరాల కోసం విచారణ జరుపుతున్నామని తెలిపారు.

ఆదాయ పరిపుష్టికి కార్యాచరణ చేపట్టండి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ఆదాయ పరిపుష్టికి కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ కేతన్ గార్గ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, డీసీఆర్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లు, అడ్మిన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, తాగునీరు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లు, హాస్పటల్స్ తదితర పన్నులతో పాటు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి పన్నులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వసూలు చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక ఏడాదికి జోన్-3 కార్యాలయం 33 శాతం అధికంగా ఆస్తిపన్ను వసూలు చేసిందని, గాజువాక జోన్ అత్యల్పంగా 5 శాతం ఆస్తి పన్నులు వసూలు చేసిందన్నారు. ఆగస్టు 31 నాటికి 50 శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా పనిచేయాలని అన్ని జోన్ల అధికారులను ఆదేశించారు. వార్డు కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు వార్డుల్లో కొత్త, పాత బిల్డింగ్ కొలతలు సరిచూడాలని, దీంతో పాటే తాగునీటి కనెక్షన్ ఉంటే వారు ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను చార్జీలు చెల్లిస్తున్నది, లేనిది గమనించాలన్నారు. ప్రతి వార్డులో ప్రజలకు దగ్గరగా ఉన్న వార్డు సచివాలయాన్ని ఎంపిక చేసి ఆస్తి పన్ను వసూలు కేంద్రం ఏర్పాటుకు పరిశీలన చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. కోర్టు కేసులు ఉన్న వాటి ఆస్తిపన్ను వసూలుకు రూల్ బుక్ ప్రకారం వసూలు చేయాలన్నారు.

పలు రైళ్లకు తాత్కాలిక హాల్ట్‌ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: పలు రైళ్లకు.. వివిధ స్టేషన్లలో కొనసాగుతున్న తాత్కాలిక హాల్ట్‌లను పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- పూరీ-తిరుపతి(17479) ఎక్స్‌ప్రెస్‌కు చినగంజాంలో హాల్ట్‌ను ఆగస్టు 3 నుంచి మరో ఆరు నెలల వరకు పొడిగించారు. ఈ రైలు చినగంజాంకు సాయంత్రం 3.54 గంటలకు చేరుకుని, 3.55 గంటలకు బయలుదేరుతుంది.
- బిలాస్‌పూర్-తిరుపతి(17481) ఎక్స్‌ప్రెస్‌కు చినగంజాంలో హాల్ట్‌ను ఆగస్టు 5వ తేదీ నుంచి మరో ఆరు నెలలు పొడిగించారు. ఈ రైలు చినగంజాంకు సాయంత్రం 3.53 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 3.55 గంటలకు బయలుదేరుతుంది.
- గుంటూరు-రాయగడ (17243) ఎక్స్‌ప్రెస్‌కు భీమడోలులో హాల్ట్‌ను ఆగస్టు 2 నుంచి మరో ఆరునెలలు పొడిగించారు. ఈ రైలు ప్రతి రోజూ తెల్లవారు 1.14 గంటలకు భీమడోలు చేరుకుని, అక్కడ నుంచి 1.15 గంటలకు బయలుదేరుతుంది.
- సికింద్రాబాద్-విశాఖపట్నం(20707) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరులో హాల్ట్‌ను ఆగస్టు 25 నుంచి మరో ఆరు నెలలు పొడిగించారు. ఈ రైలు ఏలూరు స్టేషన్‌కు ఉదయం 9.49 గంటలకు చేరుకుంటుంది.
- విశాఖపట్నం-సికింద్రాబాద్(20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరులో హాల్ట్‌ను ఆగస్టు 24 నుంచి మరో ఆరునెలలు పొడిగించారు. ఈ రైలు ఏలూరు స్టేషన్‌కు సాయంత్రం 5.44 గంటలకు చేరుకుంటుంది.
- విశాఖపట్నం-సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్‌ను ఆగస్టు 2 నుంచి మరో ఆరునెలలు పొడిగించారు. ఈ రైలు సామర్లకోటకు ఉదయం 7.03 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 7.05 గంటలకు బయలుదేరుతుంది.
- సికింద్రాబాద్-విశాఖపట్నం(20834)వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో హాల్ట్‌ను ఆగస్టు 2వ తేదీ నుంచి మరో ఆరు నెలలు పొడిగించారు. ఈ రైలు సామర్లకోటకు రాత్రి 9.23 గంటలకు చేరుకుని, 9.25 గంటలకు బయలుదేరుతుంది.